
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



72.250 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 72.250 టీఎంసీలు ఉన్నాయి. 21,480 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1850, ఉత్తరకాలువకు 400, కండలేరుకు 9450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,12,,940
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,164
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,469
నవర (8 గ్రాములు)	రూ.83,752

గరిష్టం/కనిష్టం
32.0 /27.3

వాతావరణం

జిల్లాలో శనివారం అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం గాలో తేమ 77 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

హౌసింగ్ కార్పొరేషన్‌లో ఇద్దరు ఏఈల సస్పెన్షన్

నెల్లూరు (అర్బన్): జిల్లా హౌసింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఏఈలు పి.రామకృష్ణ, షేక్ ముక్తార్‌బాషాలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణలో వాస్తవమని తేలడంతో వారిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. ముక్తార్‌బాషా ప్రస్తుతం కొడవలూరు మండల ఏఈగా పని చేస్తున్నారు. ఆయన గతంలో తోటపల్లిగూడూరు మండలంలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు లబ్ధిదారులకు సంబంధించిన సిమెంట్, స్టీల్ సరఫరాలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారించిన ఆ శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదిక పంపారు. సస్పెన్షన్‌కు గురైన రామకృష్ణ ప్రస్తుతం ఉదయగిరి ఏఈగా పనిచేస్తున్నాడు. గతంలో ఆయన దుత్తలూరు మండలంలో ఏఈగా పని చేశారు. అప్పట్లో ఆయనపై కూడా పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఆ శాఖ అధికారులు విచారణ జరిపారు. అవినీతికి పాల్పడినట్లు తేలడంతో ఉన్నతాధికారులు ఇచ్చిన నివేదిక మేరకు వారిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.

నేటి నుంచి పీఆర్ ఇంజినీర్లు, ఉద్యోగుల క్రీడా పోటీలు

నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజినీర్ల సంఘం, డిప్లొమా ఇంజినీర్ల సంఘం సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నుంచి పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా చైర్మన్ ఎం.బాబూరావు, జనరల్ సెక్రటరీ ఎస్కే ఖాదర్‌మస్తాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఏసీ స్టేడియంలో ఉదయం 8 గంటలకు క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, క్యారమ్స్, చెస్, రింగ్‌బాల్, పరుగు పందెం తదితర ఆటల పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖలోని అన్ని స్థాయిల్లో ఉన్న ఇంజినీర్లు, ఉద్యోగులు ఆటల పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విజేతలకు ఈ నెల 15న ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని జెడ్పీ సమావేశం మందిరంలో బహుమతులందిస్తామన్నారు.

బార్ల దరఖాస్తులకు గడువు పొడిగింపు

- 17 వరకు స్వీకరణ, 18న లాటరీ

నెల్లూరు (క్రైమ్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని 33 బార్లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసులునాయుడు శుక్రవారం రీ నోటిఫికేషన్ జారీ చేశారు. దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 17వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు పొడిగించామని, 18వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో కలెక్టర్ సమక్షంలో లాటరీ డ్రా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసులునాయుడు కోరారు.

రైతుల ఖాతాల్లో భూ సేకరణ పరిహారం

ఉలవపాడు: కరేడులో కొనసాగుతున్న భూ సేకరణలో మూడో విడతగా 38 మంది రైతులకు సంబంధించి రూ.29.57 కోట్ల పరిహారం శుక్రవారం కలెక్టర్ విడుదల చేసినట్లు ఇండోసోల్ మీడియా కోఆర్డినేటర్ లక్ష్మీనాథరెడ్డి తెలిపారు. 136.62 ఎకరాలకు ఈ నగదు జమ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 139 మంది రైతులకు 293.4 ఎకరాలకు రూ.62.38 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా పరిహారం అందించామన్నారు. ఉద్యాన పంటలకు అదనంగా ఇచ్చే నగదును కూడా ఒకే విడతగా రైతుల ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రైతులకు పది రోజుల్లో సర్వే పూర్తి చేసి నగదు జమ చేయనున్నట్లు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 66,312 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,728 మంది తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.81 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు అప్రజాస్వామికం



పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం అప్రజాస్వామికం. 'సాక్షి' పత్రిక తప్పుడు కథనాలు రాసి ఉంటే వివరణ కోరవచ్చు. లేదా రాజ్యాంగబద్ధంగా న్యాయస్థానంలో కేసు వేయొచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సాగిస్తున్న దుర్మార్గ పాలనను 'సాక్షి' వెలుగులోకి తేవడాన్ని జీర్ణించుకోలేకనే ఏకంగా ఎడిటర్‌తోపాటు విలేకరులపై కేసులు నమోదు చేయడం ఏమిటి. ప్రజాస్వామ్యదేశంలో ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు జరిగినట్లు చరిత్రలో లేదు. ప్రజలకు వాస్తవాలను తెలియజేసే విలేకరులపై పోలీసుల ద్వారా కేసులు పెట్టించడం విచారకరం. సోషల్ మీడియాను బెదిరించడం, అరెస్టులు చేయడంపై ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం లేకుండా పోతుంది. ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశంలో మన రాష్ట్రంలో పాత్రికేయ రంగంపై బెదిరింపు కేసులు పెట్టడం సరైంది కాదు.

– ఆదాల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ, నెల్లూరు



వాస్తవాలు రాస్తే కేసులు పెడతారా?



ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాల్లో మీడియా ఒక స్తంభం. అలాంటి మీడియా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా ఉంటూ వాస్తవాలను వెలుగులోకి తెస్తుంటే ప్రభుత్వం కేసులు నమోదు చేయడం దుర్మార్గంగా ఉంది. 'సాక్షి' పత్రిక ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతుందని ఎడిటర్‌పైనా, విలేకరులపైనా కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యంలో ఇంత వరకు జరగలేదు. దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా ఇంతగా బరి తెగించలేదు. ప్రజలతీర్పుతో పార్టీల అధికారాలు మారుతూ ఉంటాయి. 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీపై కక్షతోనే ఈ ప్రభుత్వం 'సాక్షి' పత్రికపై పక్షపాత వైఖరి అవలంభిస్తోంది. కేసులు పెట్టి, పోలీసులతో దాడులు చేయించి భయపెట్టాలని చూడడం సరైన పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి సరికాదు.

– మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ, నెల్లూరు



వెంకటరెడ్డిపాళెం చెరువు నుంచి గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్



నాగంబొట్లకండ్రిగలో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు

అధికారుల కళ్లకు గంతలు..
గ్రావెల్స్ గుంతలు

▸▸ సర్వేపల్లిలో మాఫియా బరితెగింపు

సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా బరితెగింపు పతాక స్థాయికి చేరింది. స్థానిక ప్రజాప్రతినిధి అండతో అధికార పార్టీ నేతలు విచ్చలవిడిగా ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో తవ్వేస్తున్నారు. ఊరూరా 'బావులు' తలపించే రీతిలో తవ్వకాలు చేపడుతున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం కళ్లకు గంతలు కట్టుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. రేయింబవళ్లు భారీ యంత్రాలు పెట్టి ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. ఎవరైనా స్థానికులు ప్రశ్నిస్తే అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గనులను మరిపించే విధంగా తవ్వుకోమని ఏ అధికారి అనుమతి ఇచ్చాడని స్థానికులు నిలదీస్తున్నారు.

- ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- కొల్లగొడుతున్న రూ.కోట్లు ప్రకృతి సంపద
- పట్టించుకోని మైనింగ్ అధికారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. దాదాపు పదిహేను నెలలుగా అధికార యంత్రాంగాన్ని కట్టడి చేసి ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రూ.కోట్ల విలువైనా ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. రేయింబవళ్లు తవ్వకాలు చేపడుతూ, టిప్పర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నా.. అధికారులకు మాత్రం కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమ గ్రావెల్ దందా కొనసాగుతున్నా.. గ్రావెల్ మాఫియా ఇచ్చే మామూళ్లతోఅధికారులు పట్టించుకోకపోవడంతో కళ్లకు గంతలు కట్టుకుని మౌనంగా ఉంటున్నారని ఆరోపణలు లేకపోలేదు.

అటవీ భూములనూ వదలట్లేదు!

సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి పంచాయతీ నాగంబొట్లకండ్రిగలో ఏడాది కాలంపైగా కూటమి నేతలు అటవీ, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే గ్రావెల్ దోపిడీ చేస్తున్నారు. గ్రామం అనుకొని 100 ఎకరాలకు పైగా అటవీ భూములు ఉన్నాయి. ఈ భూములను తమకు పంపిణీ చేస్తే సాగు చేసుకుని జీవిస్తామని ఏళ్ల తరబడి నుంచి స్థానికులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ భూములపై టీడీపీ నేతల కన్ను పడింది. అనుమతులు లేకుండానే ఆ భూముల్లో భారీ యంత్రాలతో రాత్రి పగలు తేడా లేకుండా 15 నుంచి 20 అడుగుల లోతు వరకు బావులను తలపించే రీతిలో గ్రావెల్ తవ్వేసి నెల్లూరు నగరంలోని లేఅవుట్లకు అక్రమంగా తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ గ్రావెల్ రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తూ రూ.కోట్లాది సొమ్ము చేసుకుంటున్నారు.

కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

నాగంబొట్లకండ్రిగలో ఏడాది కాలం నుంచి గ్రావెల్ అక్రమ దందా నిర్విరామంగా కొనసాగుతుంది.



నాగంబొట్లకండ్రిగ నుంచి టిప్పర్లో గ్రావెల్ తరలింపు

గ్రావెల్ అక్రమ రవాణాకు సంబంధించి మైనింగ్ అనుమతులు లేకుండానే చేస్తున్నా.. మైనింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. సామాన్య పేదలు ఇంటి అవసరాల కోసం ట్రాక్టర్ మట్టి తోలుకోవాలంటే అనుమతులు తప్పనిసరి అని చెప్పే అధికారులు, నాగంబొట్లకండ్రిగలో భారీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతూ, నిత్యం వందలాది టిప్పర్లతో అక్రమ రవాణా చేస్తున్న అధికారులు అధికారుల కళ్లకు గంతలు కట్టుకున్నట్లు మౌనంగా ఉండడంపై పలు విమర్శలు వస్తున్నాయి. భారీ శబ్దాలతో టిప్పర్లు తిరుగుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకొని గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వెంకటరెడ్డిపాళెం చెరువు కట్ట ధ్వంసం

ప్రభుత్వ భూములు, చెరువుల్లో ఇప్పటి వరకు గ్రావెల్ తవ్వి సొమ్ము చేసుకుంటున్న కూటమి నేతలు తాజాగా వెంకటాచలం మండలం గుడ్లూరువారిపాళెం పంచాయతీ వెంకటరెడ్డిపాళెం చెరువు కట్టను ధ్వంసం చేసి గ్రావెల్ తరలిస్తున్నారు. మూడు రోజుల నుంచి యంత్రాలు పెట్టి యథేచ్ఛగా ధ్వంసం చేస్తున్నారు. చెరువు కట్ట ధ్వంసంపై స్థానిక రైతులు ఇరిగేషన్, రెవెన్యూశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. కానీ ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడంతో రేయింబవళ్ల ట్రాక్టర్లతో గ్రావెల్ తరలింపు ఆగడం లేదు. రైతులు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేసినా గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు రైతులను బెదిరిస్తున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని చెరువు కట్ట ధ్వంసం చేయడాన్ని అడ్డుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



వెంకటరెడ్డిపాళెం చెరువు కట్టను జేసీబీ యంత్రంతో ధ్వంసం చేస్తున్న దృశ్యం

అనుమతులుంటే చూపిస్తావా.. సోమిరెడ్డీ

- మాజీ మంత్రి కాకాణి సవాల్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలకు ఎంత మేర అనుమతులు ఉన్నాయో, ఎంత గ్రావెల్ తవ్వకాలు జరిగాయో ఆధారాలతో సహా చూపిస్తావా.. సోమిరెడ్డీ అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో సోమిరెడ్డిపై ధ్వజమెత్తారు. తాను చాలెంజ్ విసురుతున్నానని, వెంకటాచలం మండలం నాగంబొట్లవారి కండ్రికలో జరిగిన తవ్వకాలను చూపించేందుకు మీడియాను తీసుకొచ్చి చూపే దమ్ము సోమిరెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. చట్టపరంగా గ్రావెల్ తవ్వుతుంటే.. ఆ గుంతలను చెత్తా చెదారంతో పూడ్చాల్సిన అవసరం ఏముందన్నారు. గుడ్లూరువారిపాళెం చెరువు కట్టను తవ్వుతున్నారు. కనబడడం లేదా? అని ప్రశ్నించారు. తనపై సోమిరెడ్డి పెట్టిన కేసులకు, చేసిన ఆరోపణలకు సీబీఐ విచారణకు సిద్ధంగా ఉన్నానని చాలెంజ్ చేశారు. గతంతోపాటు ప్రస్తుతం సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి నిగ్గు తేల్చాలన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని దూషిస్తే చంద్రబాబు మంత్రి పదవి ఇస్తాడేమోననే భ్రమలో సోమిరెడ్డి ఉన్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కాలి గోటికి కూడా ఆయన సరిపోడని, తమ నాయకుడిని విమర్శించే స్థాయి సోమిరెడ్డికి లేదన్నారు. రాష్ట్రంలోని బస్సులన్నీ మళ్లించి సూపర్ సిక్స్ సభకు పంపారని, పోలీసులందరిని ఆ సభలోనే పెట్టుకున్నారన్నారు. సూపర్ సిక్స్ సభకు రాని వారిపై ఫైన్లు వేశారని, 'అన్నదాత పోరు' కార్యక్రమానికి వచ్చిన వారిపై కేసులు పెట్టారని తెలిపారు. ఎన్ని కేసులు పెట్టినా సూపర్ సిక్స్ సభ కంటే ఎక్కువ మంది 'అన్నదాతపోరు' కార్యక్రమానికే జనం ఎక్కువగా వచ్చారని, అధికారాన్ని చూపిన సూపర్‌సిక్స్ సభకు జనం రాలేదని అన్నారు. 'నేను లావే.. నాకు తిన్నది తిన్నట్లుగా వంట బడుతుంది. ఆయనకు మాదరిగా నాకు కుళ్లు కుతంత్రాలు లేవంటూ కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యంగ్యాస్త్రాలు విసిరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

టీడీపీ నేత గుప్పెట్లో రెవెన్యూ వ్యవస్థ

- భూముల మ్యుటేషన్ కావాలంటే ముడుపులు ముట్టజెప్పాల్సిందే
- జలదంకి తహసీల్దార్ కార్యాలయ అడ్డాగా అవినీతి
- ఈ దందాపై తమ్ముళ్ల ఆరోపణలు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో, వీడియో



జలదంకి తహసీల్దార్ కార్యాలయం

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలోని జలదంకి తహసీల్దార్ కార్యాలయాన్ని ఓ టీడీపీ నేత అవినీతికి అడ్డాగా మార్చేశాడు. రెవెన్యూ వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకుని, ప్రతి పనికీ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నాడు. అడిగినంత ఇవ్వకపోతే ఏ పని చేయడానికి వీల్లేదని రెవెన్యూ అధికారులకు స్పష్టం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా భూముల మ్యుటేషన్‌కు సంబంధించి ముడుపులు ముట్టజెప్పకుంటే నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టిస్తున్నట్లు టీడీపీ నేతలే ఆరోపిస్తున్నారు. తాజాగా ఓ టీడీపీ నేత.. సదరు టీడీపీ నేత అవినీతిపై ఓ మీడియా ప్రతినిధితో మాట్లాడిన ఆడియో, వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సంచలనం రేపుతోంది. జలదంకి మండలం కమ్మవారిపాళెంకు చెందిన కర్రావుల అప్పలనాయుడు ప్రతీ శాఖను శాసిస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్‌శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు సైతం ఆయన కనుసన్నల్లోనే పని చేయాలని ఎమ్మెల్యే కాకర్ల ఆదేశాలిచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అత్తగారి ఊరు కమ్మవారిపాళెం. మండలంలోని ప్రభుత్వశాఖలను శాసిస్తున్న అప్పలనాయుడు ఇల్లు.. కాకర్ల అత్తగారింటి పక్కనే ఉండడంతో, ఆయన మామతో చెప్పించుకుని మండలాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్నట్లు ఆ పార్టీలోనే నేతలు చెప్పుకుంటున్నారు. తాజాగా అప్పలనాయుడుకి జలదంకి పీఏసీఎస్ చైర్మన్ పదవిని కూడా కాకర్ల కట్టబెట్టారు. జలదంకి రెవెన్యూ శాఖలో జరుగుతున్న పరిస్థితిపై ఒక విలేకరి ఆ మండలంలోని గోపన్నపాళెం చెందిన టీడీపీ నేత మల్లేష్‌నాయుడుకు ఫోన్ చేయగా ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. మండలానికి చెందిన ఓ టీడీపీ నేత కనుసన్నల్లో రెవెన్యూ, పోలీస్ వ్యవస్థలు నడుస్తున్నాయని, ప్రతి పనికీ ఒక రేటు ఉందని చెప్పడం, సదరు నేత ఎమ్మెల్యేకు చెడ్డపేరు తెస్తున్నాడని, ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు కూడా చెబుతామని అనడం విశేషం.రోస్టర్ నంబరు మార్చడానికి రూ.24 వేలు ఇచ్చానని, రెవెన్యూ ఉద్యోగులకు పలుమార్లు లంచం ఫోన్‌పే ద్వారా ఇచ్చానంటూ టీడీపీ నాయకుడే బయట పెట్టడంతో ఆ పార్టీ నాయకుడుతోపాటు రెవెన్యూ అధికారులు ఎంత దోచుకుంటున్నారో అర్థమవుతుంది. ప్రస్తుతం ఈ ఆడియో, వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

బాలికపై లైంగికదాడికి యత్నం

ఉలవపాడు: ఓ బాలికపై లైంగికదాడికి యత్నించిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఎస్సై అంకమ్మ కథనం మేరకు.. ఓ బాలికను తల్లిదండ్రులు కావలి సమీపంలోని ఏనుగులబావికి చెందిన కొండయ్య వద్ద బాతులు మేపే పనికి నాలుగేళ్ల క్రితం చేర్చారు. అతని అల్లుడు రామకృష్ణ ఉలవపాడులో నివాసముంటూ సింగరాయకొండ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలానికి కొండయ్య బాలికను రామకృష్ణ ఇంట్లో పనిచేయడానికి పంపించాడు. ఆ తర్వాత మండలంలోని చాగల్లు వద్ద ఈనెల 3వ తేదీన ఆ బాలిక అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. వారు వివరాలు తెలుసుకున్నారు. తండ్రిని పిలిపించగా అతను మద్యం మత్తులో ఉన్నాడని బాలిక వెళ్లకపోవడంతో కొడవలూరు మండలం రాజుపాళెంలోని విశ్వజనని ఆశ్రమంలో ఈనెల 5వ తేదీన చేర్పించారు. తనపై రామకృష్ణ లైంగికదాడికి యత్నించినట్లు అక్కడి వారికి బాలిక తెలిపింది. పని చేయలేదంటూ కొట్టినట్లు గోడు చెప్పుకొంది. దీంతో ఆశ్రమ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రామకృష్ణ దంపతులు, పనికి కుదుర్చుకున్న కొండయ్య దంపతులు, బాలిక తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా



రేషన్ బియ్యం తరలిస్తూ..

అల్లూరు: మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణ యథేచ్ఛగా జరుగుతోంది. కొందరు వ్యక్తులు లబ్ధిదారుల వద్ద కేజీని రూ.10 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేసి నిల్వ ఉంచి మంచి ధరకు దళారులు, మిల్లర్లకు అమ్ముతున్నారు. అల్లూరు మారుతీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి భారీ స్థాయిలో రేషన్ బియ్యాన్ని ఇంట్లో నిల్వ ఉంచాడు. గురువారం రాత్రి ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న తరుణంలో స్థానికులు అతడిని అడగ్గా ఏమి చేసుకుంటారో చేసుకోవాలన్నారు. బియ్యాన్ని తరలించాడు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలున్నాయి.

12 బస్తాల్లో..

ఆటోలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలియజేశారు. పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని పురిణి గ్రామం నుంచి ఆటోలో 12 బస్తాల్లో సుమారు 300 కేజీల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. పోలీసులు పట్టుకుని కోవూరుకు చెందిన ఆటో డ్రైవర్ సురేష్‌పై కేసు నమోదు చేశారు.

అక్షరమే ఆయుధం





కేసులు పెట్టడం దుర్మార్గం

ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని గుర్తు చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న సాక్షిపై కేసులు పెట్టడం దుర్మార్గం. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే జర్నలిస్టులపై కేసులు పెట్టడం దారుణం. దీనికి వ్యతిరేకంగా రానున్న రోజుల్లో పోరాటాలు చేయాల్సిన పరిస్థితులు తలెత్తే అవకాశముంది.

– మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి



మంచి పద్ధతి కాదు

మీడియా గొంతు నొక్కేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది మంచి పద్ధతి కాదు. ప్రజల పక్షాన నిలిచే మీడియాపై కక్ష సాధింపులకు దిగడం సరికాదు. ప్రతిపక్షపాత్ర పోషిస్తున్న సాక్షిపై, అందులో పనిచేసే ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టడం ప్రభుత్వ దిగజారుడుతనానికి పరాకాష్ట. కేసులను ఎత్తేయాలి.

– మారుబోయిన రాజా, కార్యదర్శి, సీపీఎం నరుకూరు శాఖ

పేదలే వారి టార్గెట్

- రుణాలిస్తామని నమ్మించి మోసం
- బ్లాక్‌మనీని చలామణిలోకి తెచ్చేందుకని మాయమాటలు
- పోలీసులకు చెప్పొద్దన్న కేటుగాళ్లు
- రూ.3,300 చొప్పున వసూలు చేసి నాసిరకం ఫ్యాన్లు అంటగట్టిన వైనం
- సుమారు 600 మంది బాధితులు
- రూ.లక్షలు దండుకుని పరారైన ఇద్దరు వ్యక్తులు

దుత్తలూరు: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని పేదలకు రుణాలిస్తామని కేటుగాళ్లు నమ్మించి నగదు వసూలు చేసి పరారయ్యారు. దుత్తలూరు, పరిసర మండలాల్లో జరిగిన ఈ వ్యవహారం శుక్రవారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు లక్ష్మి ఫైనాన్స్ సంస్థ పేరుతో ప్రజల వద్దకెళ్లారు. బ్లాక్‌మనీని చలామణిలోకి తెచ్చుకునేందుకు అతి తక్కువ వడ్డీకి రుణాలిస్తున్నామని నమ్మబలికారు. అయితే రుణాలు మంజూరు చేయాలంటే ముందుగా తమ దగ్గరున్న ఫ్యాన్లను తీసుకోవాలన్నారు. దానిని తీసుకుని రూ.3,300 చెల్లించిన వారికి రూ.55 వేల రుణమిస్తామని చెప్పారు. వాస్తవానికి ఒక్కో ఫ్యాన్ ధర రూ.1,000 కూడా ఉండదని బాధితులు చెబుతున్నారు. అవి కూడా సక్రమంగా పని చేయడం లేదంటున్నారు.

ఎక్కడంటే..

ఆ ఇద్దరు వ్యక్తులు నాలుగైదు రోజుల క్రితం దుత్తలూరు మండలంలోని కట్టకిందపల్లి దళిత కాలనీ, ఏఏ కాలనీ, ఎట్టిపాళెం తదితర కాలనీలతోపాటు మండలంలోని పలు ప్రాంతాలకు వెళ్లారు. గుట్టుచప్పుడు కాకుండా రుణాలు ఇస్తామంటూ సుమారు రూ.10 లక్షల మేర దండుకున్నారు. 11వ తేదీన వస్తామని, ఆధార్, రేషన్‌కార్డుల జెరాక్స్‌లు, రెండు ఫొటోలు సిద్ధం చేసుకుంటే ఒక కార్డు అందజేసి వెంటనే రుణ మొత్తాన్ని నగదు రూపంలో అందజేస్తామన్నారు. రూ.55 వేల రుణం ఇస్తే నెలకు రూ.2,650 వంతున 24 నెలల పాటు వాయిదాలు చెల్లించాలన్నారు. ఇదంతా రహస్యంగా ఉంచాలని, పోలీసులకు చెబితే బ్లాక్‌మనీ బట్టబయలవుతుందని, అందుకే మీకు ఆఫ్‌లైన్ ద్వారా రుణాలు అందిస్తున్నామని నమ్మించారు. అంతేకాక ఫ్యాన్లు ఇచ్చే సమయంలో ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా పంపుతామంటే వద్దని, చేతికి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరికి అనుమానం వచ్చి ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెప్పారు. రోజువారీ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదలు రుణంతో అవసరాలు తీరుతాయని భావించారు. ఫ్యాన్లకు నగదు చెల్లించినట్లు రశీదు ఇవ్వాలని బాధితులు అడిగితే.. మీకు అవసరం లేకపోతే రుణాలిచ్చినప్పుడు ఫ్యాన్లు తిరిగి తీసుకుని ఆ నగదును రుణ వాయిదాల్లో తగ్గించుకుంటామని సెలవిచ్చారు. బిల్లుల తమ వద్ద ఉంటాయన్నారు.



ఫ్యాన్లను చూపుతున్న బాధితులు

మీకే నష్టమంటూ..

పలువురు మిమ్మల్ని ఎలా నమ్మాలని ప్రశ్నించగా.. ఎవరో ఎక్కడో మోసం చేశారని అందర్నీ అనుమానిస్తే మీకే నష్టమని కేటుగాళ్లు చెప్పారు. దీంతో తమకు రుణాలిస్తే చాలని మిన్నకుండిపోయారు. దుత్తలూరులో గదిని అద్దెకి తీసుకుని కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, తమకు గుంటూరు, రాజమండ్రిలో ప్రధాన కార్యాలయాలున్నాయని, వింజమూరు, బద్వేలు ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ఉన్నాయని ఎవరు అనుమానించొద్దని ఆ ఇద్దరు చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గంలోని పలు మండలాల్లో సుమారు 600 మంది వరకు రూ.3,300 చొప్పున చెల్లించినట్లు తెలుస్తోంది. సుమారు రూ.20 లక్షల వరకు దండుకున్నారు. 11వ తేదీన వారు రాకపోవడంతో బాధితులు ఫోన్ చేయగా అది పని చేయలేదు. దుత్తలూరులోని గదిని ఖాళీ చేసేశారు. దీంతో మోసపోయామని బాధితులు గ్రహించి లబోదిబోమంటున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని చాలా మంది లోలోపల కుమిలిపోతున్నారు. ఆ ఇద్దరు వివిధ ప్రాంతాలు తిరుగుతూ ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిసింది.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.40 సన్నవి : రూ.25
పండ్లు : రూ.15

గంజాయి విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం గంజాయి విక్రయాలపై దాడులు చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు బీవీ నగర్‌లోని ఆ శాఖ కార్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.అనిత వివరాలు వెల్లడించారు. అనిత తన సిబ్బందితో కలిసి వెంకటేశ్వరపురంలో గంజాయి విక్రయిస్తున్న ఎస్‌డీ మౌలాలీని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాళెంలో గంజాయి విక్రేత ఎ.ఓ మ్రేష్‌ను అదుపులోకి తీసుకుని 2.5 కేజీలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నిందితుడు మౌలాలీని నెల్లూరు ఎక్సైజ్ - 1 స్టేషన్లో, ఓమ్రేష్‌ను కోవూరు ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాపై టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని అనిత తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సీహెచ్ పూర్ణకుమార్, హెచ్‌సీలు ఎ.రమేష్‌కుమార్, ఎం.కిరణ్ సింగ్, ఎస్.ప్రసాద్, కానిస్టేబుళ్లు ఎం.మునిరాజ్‌కుమార్, ఎం.వెంకటేశ్వర్లు, కె.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితుడితో ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చేందుకు..

- తండ్రి డబ్బులివ్వలేదని యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): తండ్రి డబ్బుల్లేవని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పెంచలప్రసాద్ (21) నివాసముంటున్నాడు. అతను ఐటీఐ వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 7వ తేదీన ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చేందుకు నగదు ఇవ్వాలని తండ్రి పెంచలయ్యను ప్రసాద్ అడగ్గా లేవని చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు అదేరోజు తన ఇంట్లో ఎలుకల మందు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నారాయణ హాస్పిటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున ప్రసాద్ మృతిచెందాడు. బాధిత తండ్రి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ఈ ప్రభుత్వం దళితులకు వ్యతిరేకం



మాట్లాడుతున్న టీజేఆర్ సుధాకర్‌బాబు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం దళితులకు వ్యతిరేకమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఎస్సీ విభాగం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసే చర్యల్లో భాగంగా సమావేశమైనట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వంలో డీబీటీ ద్వారా రూ.2.75 లక్షల కోట్లు లబ్ధిదారులకు అందిస్తే అందులో రూ.50 వేల కోట్లు మాల, మాదిగ, రెల్లి కులస్తులకు వివిధ పథకాల ద్వారా అందాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావడం కోసం సూపర్‌సిక్స్ అమలు చేస్తామని ఆయా సామాజికవర్గాల వారికి హామీ ఇచ్చారన్నారు. ఏడాదిగా రూ.10 వేల కోట్లు మాల, మాదిగ, రెల్లి కులస్తులకు బాబు బాకీ పడ్డారన్నారు. ఉచిత బస్సు తమ కులాలకు ఏ మాత్రం ఉపయోగకరం కాదన్నారు. సూపర్‌సిక్స్‌ను తొలి ఏడాది అమలు చేయకపోవడంతో నష్టం వాటిల్లిందన్నారు. రెండో ఏడాదిలో అమలు చేస్తున్న పథకాల్లో వారికి భాగస్వామ్యం లేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పిల్లలు మంచి బడుల్లో ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్నారన్నారు. దళితులంటే కోపం కాబట్టి ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అవేవీ లేకుండా పోయాయన్నారు. దళితులను ఉక్కుపాదంతో తొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎస్సీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కె.కనకారావు, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.22,21,350

వెంకటగిరి రూరల్: వెంకటగిరి శక్తి స్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి దేవస్థానానికి సంబంధించి ఆదాయం రూ.22,21,350 వచ్చినట్లు ఈఓ వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గత 25 రోజుల హుండీ కానులను శుక్రవారం లెక్కించారు. రూ.22,21,350 నగదు, యూఎస్ డాలర్లు 5, బంగారం 1,852 గ్రాములు, వెండి 37 గ్రాములను భక్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధీర్, జాతర సేవా కమిటీ సభ్యులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.141
లేయర్	రూ.115
బ్రాయిలర్ చికెన్:	రూ.250
స్కిన్‌లెస్ చికెన్:	రూ.274
లేయర్ చికెన్:	రూ.195

